క్లుప్తంగా

రాములోరి పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ కార్యక్రమాన్ని భక్తుల భజనలు, కీర్తనల మధ్య గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని శ్రీఅభయ సీతారామాలయంలో ఈనెల 6న శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారామ కల్యాణానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆహ్వానించారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు పోల నవీన్, శ్రీనివాస్‌గుప్తా, జగన్, మోతీలాల్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేసి శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని కోరారు.

సేంద్రియ సాగుపై శిక్షణ

రాజస్తాన్ వెళ్లిన రైతు దేవేందర్



రాజస్తాన్‌లో జరిగే శిక్షణ పాల్గొన్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో సేంద్రియ వ్యవసాయంపై జరిగిన శిక్షణకు కౌడిపల్లి మండలంలోని తునికి దేవుల తండాకు చెందిన రైతు కొర్ర దేవేందర్ వెళ్లినట్లు ఏఓ స్వప్న, ఏఈఓ సహితి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రాజస్థాన్‌లో సస్టెనబుల్ యోగిక్ అగ్రికల్చర్ ప్రోగ్రాం సేంద్రియ వ్యవసాయ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ఆత్మ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఒక రైతును శిక్షణ కోసం ఎంపిక చేయగా, కౌడిపల్లి మండలం దేవులతండాకు చెందిన కొర్ర దేవేందర్ ఒక్కరే వెళ్లినట్లు చెప్పారు. మూడురోజుల పాటు అక్కడ జరిగే శిక్షణలో మిగతా రైతులతో కలిసి పాల్గొంటాన్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడుకుంటాం

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా హెచ్‌సీయూ భూములను కాపాడుకుంటామని ఏబీవీపీ మండల కన్వీనర్ వంశీగౌడ్ అన్నారు. వంశీగౌడ్ హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల ఉద్యమాన్ని అణచి వేయలేదని ప్రాణాలకు తెగించైనా హెచ్‌సీయూ భూములను కాపాడుకుంటామని తెలిపారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు పోరాడుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏబీవీపీ విద్యార్థి నాయకుడు బండారి ప్రశాంత్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు.

ఫొటో విధానాన్ని రద్దు చేయాలి: మల్లేశం



మాట్లాడుతున్న సీపీఎం నేత మల్లేశం

పాపన్నపేట(మెదక్): ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఫొటో హాజరు విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కొడుపాక గ్రామంలో ఉపాధి హామీ పనుల ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. రోజుకు రెండు సార్లు ఫొటోలు తీయడం వల్ల కూలీల సమయం వృథా అవుతుందన్నారు. గ్రూపులో ఒక వ్యక్తి ఫొటో రాకపోతే ఆ గ్రూపు కూలీలకు డబ్బులు రావడం లేదని వాపోయారు. దీంతో కూలీలు ఆందోళన చెందుతున్నారన్నారు. భూ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 7న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పాపయ్య, అశోక్, తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడడం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, అరుణ, శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణంలోని ఆయా కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుతో పట్టణాధ్యక్షుడు రవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో రాజ్యాంగం పరిరక్షణ కోసం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మహాత్మగాంధీ, అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, కృష్ణ, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

పెద్దశంకరంపేట(మెదక్): జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ భారత రాజ్యాంగ యాత్ర కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల ఆధ్వర్యంలో గురువారం చేశారు. కోళాపల్లి, మక్తలక్ష్మాపూర్, బూర్గుపల్లి గ్రామాల మీదుగా నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ నియంతృత్వ పోకడల ద్వారా రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, జనార్ధన్, సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, సత్య నారాయణ రావు, గోవింద్‌రావు, సాయిలు, నర్సింలు, హరిప్రసాద్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ తదితరులు



తూప్రాన్‌లో..



పెద్దశంకరంపేట(మెదక్): కోళాపల్లిలో ..

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులను మెరుగైన విద్యబోధన చేయాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. గురువారం మండలంలోని భుజిరంపేటలో ఉన్నత పాఠశాలతో పాటు పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్య బోధన, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. పీఎంశ్రీ పాఠశాలలో 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలు 13 మంది ఉండగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ప్రీస్కూల్ విద్యబోధన చిన్నారులకు అర్థమయ్యేలా ఆట పాటలతో నేర్పించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ టీవీని పరిశీలించారు. వేసవి సందర్భంగా విద్యార్థులు ఇంటి వద్ద ఎండలో తిరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రమాకాంత్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భుజిరంపేట పీఎంశ్రీ పాఠశాలలో చిన్నారులకు బోధిస్తున్న ఎంఈఓ బాలరాజు

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత



కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న ఆగడాల నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చైల్డ్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్లు నాగమణి, కవిత అన్నారు. బేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం టేక్మాల్‌లో ఉపాధిహామీ ఫిష్ పండ్ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఉపాధి కూలీలకు ఆడపిల్లల హక్కుల గురించి అవగాహన కల్పించారు. వాల్ పోస్టర్‌లను ప్రదర్శిస్తూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడ పిల్లలను తప్పకుండా చదివించాలని, బాల్యవివాహాలు జరగకుండా ఆపాలన్నారు. ఉన్నత చదువులు చదివి ఒక మంచి స్థానంలో నిలబడి అందరికి ఆదర్శంగా ఉండేలా ప్రోత్సహించాలని చెప్పారు. మద్యం తాగే అలవాట్లను దరి చేరకుండా నేటి యువతను కాపాడాలన్నారు. చెడు దారిలో పోతూ కొందరు యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలియజేశారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీనంబర్‌లు 181, 1098, 100, 155326లను బాలికలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఉపాధి హామీ ఏపీఓ పాల్ కూలీల కొలతల పని విషయాలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఏఫ్ ఏ రాములు, కూలీలు పాల్గొన్నారు.

నేడు తూప్రాన్‌కు మంత్రి దామోదర రాక

తూప్రాన్: పట్టణంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కబ్జాకు గురవుతున్న కుమ్మరికుంట

కరువైన అధికారుల పర్యవేక్షణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని కుమ్మరి కుంట స్థలం కబ్జాకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయ వీధిలో దాదాపు ఆరు ఎకరాల్లో కుమ్మరికుంట ఉంది. కుంట స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం సగం స్థలం ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలంలో కుమ్మరికుంటలోకి వర్షపు నీరు చేరితే గ్రామంలోని సగం బోరు బావుల్లో నీరు ఉంటుంది. కంటలో మట్టిని పోస్తూ ఆక్రమిస్తుండటంతో కుంటలో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో ఎండిపోతున్నాయని స్థానికులు చెప్తున్నారు. గతంలో కుమ్మరికుంటకు సంబంధించిన భూమిలో రెవెన్యూ అధికారులు సర్వే చేయించి హద్దులను వేసినా, వాటిని తొలగించి యథేచ్ఛగా కుంట స్థలం ఆక్రమిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కుంట స్థలాన్ని సందర్శించి ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి కుంటను కాపాడాలని వారు కోరారు.



కుమ్మరికుంట అక్రమ నిర్మాణాలు

6న పుత్ర కామెష్టి యాగం

నర్సాపూర్: పట్టణంలోని సువిజ్ఞాన ఆశ్రమంలో ఆదివారం పుత్ర కామెష్టి యాగం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ తెలిపారు. శాస్త్రీయంగా యాగం నిర్వహిస్తామని, సంతానం కోసం పరితపించి విసిగి పోయిన దంపతులకు పుత్రకామెష్టి యాగం వరం లాంటిదని చెప్పారు. యాగంలో పాల్గొనదలచిన దంపతులు తమను 9248828666, 7981750006 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

7, 8న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

అల్లాదుర్గం(మెదక్): పట్టణంలో ఈ నెల 7, 8న దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం నాగరాజు, ఆర్టీసీ అధికారి శేఖర్ గురువారం విలేకర్లతో చెప్పారు. నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేషయ్య ఆదేశాలతో దివ్యాంగుల సౌకర్యం కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

బైక్ దొంగలకు రిమాండ్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బైక్ దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పట్టుకొని పోలీస్‌లు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. గురువారం చిన్నశంకరంపేటలో వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగలించిన బైక్‌పై అనుమానస్పదంగా వెళ్తున్న కామారంతండాకు చెందిన సురేశ్, చందర్‌లను పట్టుకొని బైక్ పేపర్‌ల కోసం ప్రశ్నించారు. కాగా చిన్నశంకరంపేటకు చెందిన బాగులు మార్చి 30 తన పొలం వద్ద బైక్ నిలపగా, చోరీకి గురైన బైక్‌ని గుర్తించిన పోలీస్‌లు దొంగలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రామచంద్రం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో మహనీయుల ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొర్విపల్లికి చెందిన రామచంద్రం, సహ అధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా బాలస్వామి, సభా నిర్వహకుడిగా సాయిలు ఎన్నికయ్యారు. ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. నార్సింగి మండలంలోని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మల్లేశం ఎంపీడీఓ ఆనంద్‌ను కలిసి అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని వినతిపత్రం అందించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కొల్చారం(నర్సాపూర్): ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాలని జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి రాధా కిషన్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌజ్ పనులను పరిశీలించారు. రాజీవ్ యువ వికాస్ పథకం కోసం నమోదైన ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ, సిబ్బందితో సమావేశమై ఆయన వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు కులాల వారీగా విభజిస్తూ ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ద్వారా నిర్దేశించబడిన ఎల్‌ఆర్‌ఎస్ కొనసాగింపు వివరాలను ఎంపీడీఓ రఫీక్ అన్నిసాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.



ఇందిరమ్మ నమూనా ఇళ్ల పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్

ఇంటర్న్‌షిప్ పారితోషికం అందజేత



ఇంటర్న్‌షిప్ పారితోషికం అందిస్తున్న ప్రిన్సిపాల్

చేగుంట(తూప్రాన్): మోడల్ పాఠశాల ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పారితోషికం అందజేసినట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. బుధవారం విద్యార్థులకు పారితోషికం అందించారు. ఆమె మాట్లాడుతూ.. మోడల్ పాఠశాలలోని ఒకేషల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అక్టోబర్‌లో ట్రేనింగ్ లెవల్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నారు. ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వేయి రూపాయలు మంజూరీ కాగా సంబంధిత డబ్బులను అందించారు. కార్యక్రమంలో ఒకేషనల్ శిక్షకులు మధు, రఘుమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మినరల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న పరిశ్రమ హెచ్‌ఆర్ రాజేందర్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ఫ్లెమింగ్ లాబొరేటరీస్ ఎండీ ప్రకాష్, డైరెక్టర్ రాంకుమార్ అన్నారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలో ఉన్న ఫ్లెమింగ్ లాబొరేటరీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో లచ్చిరెడ్డిగూడంలో మినరల్ వాటర్ ఫ్లాంట్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఫ్లెమింగ్ పరిశ్రమ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పరిశ్రమ ద్వారా వసతుల కల్పన చేసినట్లు చెప్పారు. లచ్చిరెడ్డిగూడంలో సొంత భవనం నిర్మాణం చేపట్టి మినరల్ ఫ్లాంట్ ద్వారా ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ రాజేందర్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌గౌడ్, మాణిక్యరెడ్డి, కుమార్, ప్రశాంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సన్నబియ్యం అందాలి

తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రేషన్ కార్డు ఉన్న అర్హులందరికీ నాణ్యమైన సన్నబియ్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పం అని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం వెల్దుర్తి, మాసాయిపేటలోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాసాయిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

తంప్లూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్‌లో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు స్వరూపరాణి ఎల్లయ్య ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీని మాజీ జెడ్పీటీసీ సరోజ మల్లేశం ప్రారంభించారు. ఇందులో మండల మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ సర్పంచ్ నాగయ్య, మాజీ ఎంపీటీసీ రవిబాబు, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు తుకారాం గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పఠాన్ యాదుల్, కాంగ్రెస్ నాయకులు చిన్నమల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రాజేష్, రాజేందర్‌రెడ్డి, బాజి, లక్ష్మీనర్సింలు పాల్గొన్నారు. మండలంలోని వల్లూర్‌లో తహసీల్దార్ షేక్ కరీం సన్నబియ్యం పంపిణీ చేశారు.



వెల్దుర్తి(తూప్రాన్): సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

ఇసుక డంపు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలపై గురువారం సాక్షి దినపత్రికలో వాగులను తోడేస్తున్నారు అనే కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ సిబ్బంది స్పందించారు. తహసీల్దార్ కమలాద్రి, ఆర్‌ఐ కిషన్ శభాష్‌పల్లి గ్రామ శివారులో నిల్వ ఉంచిన ఇసుక డంపులను పరిశీలించారు. శభాష్‌పల్లి వాగులో నుంచి రాత్రి వేళల్లో హిటాచ్ ద్వారా తవ్వకాలు చేసి టిప్పర్ల ద్వారా తరలించి ఇక్కడ డంపు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడైన ఇసుక తవ్వకాలు జరిపిన, ఫిల్టర్ ఏర్పాటు చేసినా.. తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.



ఇసుక డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్ కమలాద్రి

సంక్షిప్త వార్తలు

◆ నేడు మెదక్‌లో విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డే

అల్లాదుర్గం(మెదక్): మెదక్‌లో విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్ డే శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏఈ నవాజ్ గురువారం చెప్పారు. విద్యుత్ సమస్యలు, కరెంట్ బిల్లుల సమస్యపై వినియోగదారులు గ్రీవెన్స్ డేలో పరిష్కరించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు రశీదు తీసుకొని రావాలన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎంపీడీఓ దామోదర్ పరిశీలించారు. గురువారం మండలంలోని మిర్జాపల్లి తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు.

◆ మంత్రివర్గంలో చోటు కల్పించాలి

పెద్దశంకరంపేట(మెదక్): మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాందేడ్ దుర్గయ్య ప్రభుత్వాన్ని కోరారు. మాదిగలకు సామాజిక న్యాయం కల్పించే ఎస్సీ రిజర్వేషన్ల ప్రకారం కాంగ్రెస్ నాలుగు మంత్రి పదవులను మాదిగలకు కేటాయించాలన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 141 కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరైనట్లు ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నర్సాపూర్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే సునీతారెడ్డి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరైన లబ్ధిదారులందరూ నర్సాపూర్‌కు రావాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా కోరారు.

◆ చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోపి పిల్లుట్ల గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు రాఘవరెడ్డి, శంకర్, మురళిగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, ముత్యాలు, ఆంజయ్య, శ్రీను, సతీష్, నర్సింలు, దినేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

◆ కార్మికులకు జీతాలు చెల్లించాలి

నర్సాపూర్: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో కలిసి మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కార్మికులు పుష్ప, రాములు, అనిత, సంగీత, జ్యోతి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం, సమ్మె నోటీసును జెడ్పీ సీఈఓ ఎల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు 40 ఏళ్లుగా పంచాయతీలనే నమ్ముకొని సేవలు చేసున్నా.. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి అసిఫ్, స్వామి, వీరేశ్, రాములు, నర్సింలు,సుశీల, నరమ్మ, సత్యనారాయణ, అర్జున్, ఎల్లం, మైసమ్మ, బాలమని తదితరులు పాల్గొన్నారు.

◆ క్షీరాభిషేకం

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డుపనులకు పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటానికి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. గురువారం మండల కేంద్రంలోని జంగరాయిలో ఎమ్మెల్యే చిత్రపటానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, సిద్ధిరాములు, శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరావు, రామచంద్రం, మోహన్‌నాయక్, రాజాసింగ్, జీవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన

నిజాంపేట(మెదక్): ప్రజలు ఇందిరమ్మ ఇళ్లపై అధిక డబ్బులు ఖర్చు చేసి, అప్పుల పాలు కావొద్దని మండల ఎంపీడీఓ రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

◆ విడ్డూరంగా ఉంది

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో నిధులు మంజూరైనా.. రోడ్డు పనులకు బిల్లులు ఇవ్వకుండా 14 కాలం గడిపినందుకు ఎమ్మెల్యే రోహిత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడారు. ఇప్పటికైన వెంట వెంటనే చేసిన పనులకు బిల్లులు వచ్చేలా చూడాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో గురువారం సాయత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎరుకల ఆంజనేయులు రోజువారిగా పాడిగేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు కిందికి వేలాడటంతో మేత మేస్తున్న పాడి గేదె కరెంట్ షాక్‌తో మృత్యువాత పడింది.

◆ మండలంలో వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ఈ వర్షానికి ఆరుతడి పంటలతో పాటు వరిపంటలకు మేలు చేకూరింది.